

# మా మంచి టీచర్లు



## ‘అ ఆ‘ లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

### మార్గదర్శి... మహాత్ముడు

\- ఆనంద రావ్ పట్నాయక్



ఆంధ్రదేశంలో ప్రతీ మూడోవారి పేరు సుబ్బారావు. కాని మా మాష్టారుగారి పేరులో ఒక విశిష్టత ఉంది. మాచ్చేటి సుబ్బారావు, ఎం.ఎ.బి.ఇడి. స్టేటు అవార్డు విన్నర్. నిగర్వి. నిష్టాగరిష్టుడు. సాయిబాబా భక్తుడు. ఇలా చెప్పుకుపోతుంటే పేజీలు చాలవు.

నేను జి.సి.డి హైస్కూలు, రాయగడలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రోజులు. రాయగడ ఒరిస్సాలో ఉన్నా మాది బైలింగ్యువల్ హైస్కూలు. మా తెలుగు విద్యార్థులకు తెలుగు మాష్టార్ల కొరత ఉండేది. అప్పుడు సుబ్బారావుగారు ఖాళీగా ఉంటే తాత్కాలికంగా, మాకు తెలుగు, లెక్కలు చెప్పేందుకు నియమితులయ్యారు. అప్పటికాయన బి.ఏ కూడా పాసు కాలేదు. అంతవరకు టీచర్లు మాకు శాడిస్టులుగా కనిపించేవారు. ఒక టీచరు డస్టరుతో మునివేళ్ళ మీద కొడితే, మరో మాష్టారు బొడ్డు పట్టుకుని పిండేసేవాడు. ఎర్రని మిడిగుడ్లతో మరో సారుని చూసి దడుచుకునేవాళ్ళం. అప్పుడు ప్రవేశించారు సుబ్బారావు మాష్టారుగారు. పెదాల మీద చెదరని చిరునవ్వు, తెల్లని దుస్తులతో దివి నుండి భువికి దిగివచ్చే దేవదూతలా ఉండేవారు.

మాట మధురం
మనసు మధురాతి మధురం
మంచిని పెంచిన మనీషి
చదువుని చదువులా కాకుండ
ఆటలా, పాటలా ఆలాపించిన తపస్వి

అతని పేరే సుబ్బారావు
విన్నంతనే కష్టాలు రావు.

తెలుగు పిల్లలకు తెలుగు పాఠ్యపుస్తకాలుండేవి కావు. ఎవరో, ఎక్కడో ఒరియా పుస్తకాలను అనువదించి చెప్పిన నోట్సు తప్ప మరో ఆధారం ఉండేది కాదు. మెట్రిక్కు పరీక్షలో ప్రశ్నాపత్రాలు ఇంగ్లీషులో ఉండడం చేత పిల్లలు వాటిని అర్థం చేసుకుని జవాబులు వ్రాయడం కష్టతరమై ఉండేది. బడిలో తగినంతమంది తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడం, పాఠ్యపుస్తకాలు తెలుగులో లేకపోవడం, పిల్లలు ఒరియాలో పాఠాలు విని పరీక్షలో తెలుగులో జవాబులు రాయడం ఎంత బాధాకరమైన విషయమో ఆలోచించండి.

నాల్గవ తరగతి నుండి పదకొండవ తరగతి వరకు తెలుగులో రాసి మమ్మల్ని ఆదుకున్నారు మాష్టారుగారు. ఆయన ఉపాధ్యాయ జీవితంలో ఇంట్లో ప్రవేటు ట్యూషన్స్ ఎప్పుడూ చెప్పలేదు.

మరోభారతాన్ని ఆంధ్రీకరించడానికి పూనుకున్న నన్నయ్య కొన్ని పర్వాలు మాత్రమే రాసి విరమించుకున్నాడు. మిగిలిన పర్వాలను తిక్కన తెనిగిస్తూ నిష్క్రమించాడు. అసంపూర్ణంగా మిగిలిన పర్వాల్ని ఎఱ్ఱన అనువదించి తెలుగు ప్రజలకు మహోకారం చేసాడు. సుబ్బారావు మాష్టారిని ఆధునిక ఎఱ్ఱన ఎందుకన కూడదు?

ఉద్యోగంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురుకొన్న ధీశాలి మా మాష్టారుగారు. మొదటిగా లోకల్ హైస్కూలులో టీచరుగా ఉండి ప్రవేటు యాజమాన్యం నియంతృత్వాన్ని సహిస్తూ వచ్చారు. ఆ తర్వాత మున్సిపల్ హైస్కూలులో హెడ్మాస్టారుగా చేరి అస్తవ్యస్తంగా ఉన్న స్కూలుని ఒక కొలిక్కి తెచ్చారు. అదే టైంలో ఆయన కొడుక్కి భయంకరమైన రక్త స్రావ వ్యాధి (Nose Bleeding), వచ్చింది దానికోసం ఆయన తిరగని ఊరులేదు. ట్రీటుమెంటుకి డబ్బు ఖర్చు. ఇక ఇంట్లో పెద్దకొడుకుగా ఉమ్మడికుటుంబంలో ఎన్నో ఇబ్బందులు. ఇలా శారీరకంగా మానసికంగా, ఆర్థికంగా కుంగిపోయిన మాష్టారు మేరుపర్వతంలా ధైర్యంగా ఉండేవారు. ఆయన కొడుకు పోయాడు.

దేవుణ్ణి నమ్మారు. బాబాని ఆశ్రయించారు. చివరికి 'ఏమయింది మాష్టారు అంటే ఆయన చెప్పిన మాట ఇప్పటికీ నా మదిలో మెదులుతుంది. గురుతుల్యుడిగా శ్రేయోభిలాషిగా ప్రేమించే గురువుగారి భార్యను పాము కాటు వేస్తే విలవిల్లాడిపోయిన తన గురువుగారి బాధను చూసి 'ప్రభూ! నా కుమారుడుని తీసుకుపోయి మా గురుపత్నిని బ్రతికించుమా అని ప్రార్థించారు. గురుపత్ని బ్రతికి బట్టకట్టడం, మాష్టారిగారి బాబు బలయిపోవడం' జరిగిందట. ఆయన్ని ఆధునిక బాబరు అని ఎందుకనకూడదు!

ఈనాడు నాలాంటి ప్రవాసాంధ్రులు తెలుగు మాట్లాడుతున్నాం, తెలుగు రాయగలుగుతున్నాం అంటే అది ఆయన పెట్టిన బిక్ష. తెలుగు భాష మధురాతి మధురమైనదని, ఆ భాషలో అవధానాలు, సామెతలు, పొడుపు కథలులాంటివి ఉన్నాయని మొట్టమొదటిసారి భాషాసొబగులు కళ్ళకుకట్టినట్లు వివరించిన మా మంచి మాష్టారు సుబ్బారావు.

ఆయన మితాహారి. కనీసం ఉల్లి, వెల్లుల్లి కూడా తినని శుద్ధ శాకాహారి. పొగాకు, మద్యానికి బహుదూరం. అందుకే ఆయన మాకు మార్గదర్శి. ఆయనకు వచ్చిన జబ్బు లివర్‌సిరోసిస్ అంటే తాగుబోతులకు రావల్సినది రావడం విచిత్రంగా లేదూ! 19.08.08 నాడు ఆయన స్వర్గస్తులయ్యారు. ఆయన పార్థివ శరీరం చూడ్డానికి నాకు అదృష్టం లేక పోయింది. అప్పుడు నేను అమెరికాలో ఉన్నాను. విదేశాలకు వెళ్ళేముందు మాష్టారు, ఆయన ధర్మపత్నికి పాదాభివందనం చేసి దీవనలు తీసుకోవడం నాకు ఇప్పటికీ గుర్తు. మాష్టారు గారి భార్య లీలావతి భర్తకు తగ్గ భార్య. మాష్టారుగారి విజయానికి వెనకనున్న స్త్రీమూర్తి ఆమే అంటే అతిశయోక్తికాదు.

చివరిగా ఒక మాట. ప్రముఖ దినపత్రికలో స్ట్రింగరుగా పనిచేస్తున్న ఒక విలేఖరి అవినీతి కారణంగా తొలిగించబడ్డాడు. తినడానికి తిండిలేక భార్యాబిడ్డలతో మలమల మాడిపోతున్న అతను మాష్టారి దగ్గరకు వెళ్ళి బతుకు తెరువు చూపెట్టమన్నాడు. అంతటి లేమిలో కూడా మాష్టారుగారు అతనికి నెలనెలా డబ్బిచ్చి అతను నిర్వహించే చీటి పాటకు ఆదుకున్నారు. గడువు ముగిసినా మాష్టారు డబ్బుని

మాజీ విలేఖరి ఇవ్వలేదు సరికదా నేనేమీ అతనికి బాకీలేను అన్నాడు. అయినా మాష్టారు ఉదారహృదయంతో క్షమించారు. మా ఊరి జీసస్ క్రైస్ట్ అని ఎందుకు పిలవకూడదూ!

మేం నెలకొల్పిన సాహితీ సాంస్కృతిక సంస్థ స్పందనలో ఉపాధ్యాక్షుడిగా ఉండి తగిన సలహాలిచ్చి మమ్మల్ని ప్రోత్సహించే నాయకుడు ఆయన. కానీ సాహితీవనంలో వేరుపురుగులున్నాయి జాగ్రత్త నాయనా అని హెచ్చరించేవారు. జీవన సాగరంలో మనసా, వాచా, కర్మణా తను నమ్మిన మార్గంలో పయనించిన నావికుడాయన.

